# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 148 గుంటూరు, శనివారం 07- 02 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349




ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు..

## ఇద్దరు జవాన్లు మృతి

**ముంబై, ఫిబ్రవరి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇద్దరు జవానులు మరణించారు. గడ్చిరోలి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ భద్రతాబలగాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసుల సహాయంలో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని గమనించిన మావోయిస్టులు.. భద్రతా బలగాలపైకి కాల్పులకు తెగబడ్డారు. దాంతో భద్రతా బలగాలు సైతం ఎదురు కాల్పులకు దిగాయి. ఈ నేపథ్యంలో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు.ఇద్దరు జవాన్లు సైతం మృతి చెందారని చెప్పారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో మూడు ఏకే 47 తుపాకీలతోపాటు పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అలాగే మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ ఇన్‌చార్జ్ ప్రభాకర్ మృతి చెందారని చెప్పారు. అతడిపై రూ. 25 లక్షల రివార్డు ఉందని తెలిపారు. తెలంగాణలోని కామారెడ్డి అతడి స్వస్థలమని పేర్కొన్నారు. మరోవైపు ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే వేలాది మంది మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే వందలాది మంది మవోయిస్టులు ఎదురు కాల్పుల్లో మరణించారు. దేశంలో దాదాపుగా మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయనే ఒక ప్రచారం సాగుతోంది.

## మీ భూమిపై ఎవరి కన్ను పడకుండా

# నాదీ రక్షణ



**కర్నూలు, ఫిబ్రవరి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** జీవితంలో ఎవరూ మీ భూమి మీద కన్ను వేయకుండా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. క్యూ ఆర్ కోడ్ వల్ల సెల్ ఫోన్‌లో మీ భూమి మీకు కనిపిస్తుందని వివరించారు. తాను నాలుగో సారి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఇప్పటి వరకు తన జీవితంలో ఇన్ని భూ సమస్యలు గతంలో ఎప్పుడూ చూడలేదని తెలిపారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ ముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతు కరోనా సమయంలో సైతం పని చేశారని గుర్తు చేశారు.ఏపీలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నది తన సంకల్పమని స్పష్టం చేశారు. టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు చంద్రబాబు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్, పరిశ్రమలతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. ఓర్వకల్లును తాను అభివృద్ధి చేస్తే.. వాళ్లు సర్వనాశనం చేశారన్నారు. అయినా.. మీ వారసత్వ భూమిపై వైఎస్ జగన్ ఫొటో ఏమిటని రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకే రాజముద్రతో కొత్త పుస్తకాలు ఇచ్చి.. మీకు మళ్లీ హక్కు కల్పించానని వివరించారు. మీ జుట్టు జగన్ తన చేతుల్లో పెట్టుకుని పాలించాడని విమర్శించారు. పిల్లలు స్కూల్‌కి వెళ్లితే.. ఆయన ఫొటో చూడాలి.. పొలానికి వెళ్లితే ఆయన ఫొటో చూడాలనే విధంగా వైఎస్ జగన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ దుర్మార్గుడి ఫొటో చూడాల్సిన పని ప్రజలకు ఏముందని ఆయన ప్రశ్నించారు. నూటికి 80 శాతం భూ సమస్యలు వస్తున్నాయని విమర్శించారు. లక్ష ఎకరాల ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూముల రికార్డుల్లో పెట్టారని మండిపడ్డారు. తాడేపల్లె సమీపంలో 10 ఎకరాల ప్రైవేట్ భూమిని హెలిప్యాడ్‌గా మార్చుకున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగడాలను ఈ సందర్భంగా ఎండగట్టారు. 70 ఏళ్ల రికార్డున్న ఆ భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులు మార్చారని తెలిపారు. రాజకీయ లబ్ధి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమాలు, దుర్మార్గాలు చేశారని వైసీపీ అగ్రనేతల ఆగడాలను సీఎం చంద్రబాబు బహిర్గతం చేశారు.

### లంచాల వ్యవస్థకు స్వస్తి పలకాలి: సీఎం చంద్రబాబు

ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎవరైనా మీ భూమిపై కన్నేస్తే జైలుకి వెళ్తారని స్పష్టం చేశారు. ఏ ఒక్క తప్పు ఉన్నా ఆ పట్టాదారు పుస్తకం చించేసి.. సరి చేసి ఇంకో పుస్తకం ఇస్తామని వివరించారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలని ఉద్దేశ్యంతో ఈ విధానాన్ని తీసుకుని వచ్చామన్నారు. మీకు కాల్ చేసి.. వివరాలు తీసుకుని మార్పులు చేస్తున్నామని తెలిపారు. 91 వేల మంది రైతులకు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. ఏపీని భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అర సెంట్ స్థలం కోసం కుటుంబంలో తగాదాలు వస్తున్నాయని చెప్పారు. రాయలసీమ అంటే రాళ్ల సీమ కాదని.. రతనాల సీమ అని అందుకే అన్న ఎన్టీఆర్ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని సంకల్పించారని వివరించారు. రాయలసీమకు నీరు ఇచ్చిన తర్వాతే.. చెన్నైకి ఎన్టీఆర్ నీరు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

2 లో



## ప్రతి భక్తుడికీ ధార్మిక బాధ్యత ఉంది

**అమరావతి, ఫిబ్రవరి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రతి భక్తుడికీ ధార్మిక బాధ్యత ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భగవంతుడి పట్ల భయం, భక్తి ఉన్నా.. ధర్మం అవమానానికి గురైనప్పుడు మౌనంగా ఉండే సగటు హిందూ మనస్తత్వం నుంచి మేల్కొనాల్సిన సమయం వచ్చిందన్నారు. తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం నేపథ్యంలో శుక్రవారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'మన దేవుళ్లను అవమానించినప్పుడు లేదా మన ధర్మాన్ని దూషించినప్పుడు బాధపడతాం, కానీ ఆ బాధను మనలోనే దాచుకొని 'కర్మ చూసుకుంటుంది' అనుకుంటూ మౌనంగా ముందుకు సాగిపోతున్నాం. ఈ విధానం కచ్చితంగా మారాలి. కులం, ప్రాంతం, భాషల ద్వారా మనం విడిపోయినట్లు కనిపించినా, మనందరి ధర్మం ఒక్కటే. మన హిందూ విశ్వాసాన్ని దురుద్దేశంతో అవమానించినప్పుడు మన ఆవేదనను వ్యక్తీకరించడం అసహనం కాదు, ఆత్మగౌరవం. ఇలాంటి సందర్భాల్లో మౌనం పాటించడం మన సహనాన్ని బలహీనంగా చూపిస్తుంది. మనం ధర్మ పరిరక్షకులుగా మారాలి. హిందూ ధర్మాన్ని కాపాడటం అంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదు. కేవలం మన ధర్మాన్ని మనం రక్షించుకోవడమే" అని పవన్ పేర్కొన్నారు.

## గడ్కరీజీ.. మీ సహకారానికి ధన్యవాదాలు: సీఎం



**అమరావతి, ఫిబ్రవరి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** 'ఏపీలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ అభివృద్ధికి నిరంతరాయంగా సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు గడ్కరీజీ' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఈమేరకు ఎక్స్‌లో స్పందించారు. 'ఇప్పటికే ఉన్న పోర్టులతోపాటు కొత్తగా వస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల కనెక్టివిటీపైనా కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారించడం ఆనందదాయకం. హింటర్ ల్యాండ్‌ను(మారుమూల ప్రాంతాన్ని) పోర్టుతో అనుసంధానించడంలో మచిలీపట్నం పోర్టు కనెక్టివిటీ ప్రాజెక్టు కీలకం. దీని వల్ల రవాణా ఖర్చు భారీగా తగ్గుతుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి మేం అన్ని విధాలా సహకరిస్తాం' అని సీఎం పేర్కొన్నారు.

## ఆ ముగ్గురి ప్రతిఘటనే నాకు స్ఫూర్తి

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 06 :** గుండె ధైర్యానికితోడు సమయస్ఫూర్తి ఉంటే ఎంతటి క్లిష్టపరిస్థితితినైనా ఎదుర్కోవచ్చు.. అందుకు నాడు అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు గొట్టిపాటి, స్వామి, ఎమ్మెల్యే ఏలూరి చూపిన తెగువే నిదర్శనం.. అదేనాకు స్ఫూర్తినింపింది.. మీకూ స్ఫూర్తి కావాలి' అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ భావోద్వేగ ప్రసంగం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన టీడీపీ బూత్ కమిటీల మేనేజ్‌మెంట్ వర్క్‌షాపులో ఆయన పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపునకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి పర్చూరు, కనిగిరితోపాటు మరికొన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ లోక్‌సభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆ నియోజకవర్గాల్లోని మండల పార్టీ అధ్యక్షులు బూత్ కమిటీ నిర్వహణపై నియమించిన పర్యవేక్షకులు హాజరయ్యారు. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల నుంచి వందలాది మంది పాల్గొన్న వర్క్‌షాపులో మంత్రి లోకేష్ మాట్లాడుతూ కొన్ని



సంఘటనలను ఉదహరిస్తూ వారిలో స్ఫూర్తి కలిగించే ప్రయత్నం చేశారు. ఆ సందర్భంగా ఏలూరితోపాటు ప్రస్తుత రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి, స్వామిలను కొనియాడుతూ మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో మూకుమ్మడిగా మన నాయకుడిపై దాడికి దిగే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఏలూరి సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ.. మమ్మల్ని దాటి ముందుకు కదలండి అంటూ ముందుకొచ్చారు. మరోవైపు స్వామి, గొట్టిపాటి కూడా రంగంలోకి వచ్చారు. వారి సమయస్ఫూర్తి, తెగింపుతో అసెంబ్లీలో ఉన్న మిగిలిన మన సభ్యులు కూడా అప్రమత్త మయ్యారు. లేకుంటే ఆ రోజు మననా యకుడు (చంద్రబా బు)పై వైసీపీ ఎమ్మెల్యేలు దాడి చేసి ఉండేవారు. నాయకుడిని, కార్యకర్తను కాపాడుకునేందుకు అలాంటి తెగింపు, సమయస్ఫూర్తిఉండాలని అప్పుడే గుర్తించారు. ఆ సంఘటనే నాకు స్ఫూర్తి అయింది. మీరు కూడా స్ఫూర్తిగా తీసుకుని మీ పరిధిలో కార్యకర్తలకు ఇబ్బందులు ఎదురైనప్పుడు ఐక్యంగా ముందుకునడవాలని హితవుపలికారు. అంతేగాక ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చి వర్క్‌షాపులో పాల్గొన్న వారికి 'మీలో మీ ఎమ్మెల్యే ఎంతమందికి తెలుసు, ఎవరెవరు నేరుగా మాట్లాడుతన్నార'ని ఆరాతీశారు. ఆ సందర్భంగా ఏలూరిని పిలిచి ఈయన మీకు తెలుసా, మీలో ఎంతమంది ఆయనతో మాట్లాడారంటూ పర్చూరు నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి వర్క్‌షాపునకు వెళ్లిన వారిని ప్రశ్నించారు. వారంతా మాకు తెలుసు మాట్లాడతాం అంటూ చెప్పారు. మిగిలిన నియోజకవర్గాల వారు కూడా మీమీ ఎమ్మెల్యేతో నేరుగా మాట్లాడండి, కార్యకర్తలకు అండగా ఉండండి అని చెప్పారు.

## ప్రజలు తిరస్కరించినా ప్రచారం కోసం ప్రయత్నమా?



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్‌సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రద్దు చేసి.. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలంటూ ఆ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. 'మీ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారు. అయినా మీరు ప్రచారం కోసం న్యాయ వేదికను వాడుకోవాలనుకుంటున్నారా..?' అంటూ సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ ప్రశ్నించారు. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీకి దిగిన జన్‌సురాజ్ పార్టీ ఖాతా కూడా తెరవలేకపోయింది. 202 స్థానాలను దక్కించు కొని ఎన్డీయే అధికారాన్ని నిలుపుకొంది. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత..ఎన్డీయే ప్రభుత్వం సీఎం మహిళా రోజ్‌గార్ యోజన కింద మహిళలకు రూ.10 వేల చొప్పున నగదు బదిలీ చేసి ఎన్నికల నియమావళిని ఉల్లఘించిందని జన్‌సురాజ్ పార్టీ తన పిటిషన్‌లో ఆరోపించింది. ఎన్నికలు చెల్లవంటూ ప్రకటించాలని కోర్టును కోరింది. అయితే ఈ పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

## నరవణె పుస్తకంపై కేంద్రం క్లారిటీ..

### "నిషేధం లేదు.. కేవలం నిబంధనల ప్రకారమే పరిశీలన"



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 06 :** ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె రాసిన పుస్తకం విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి విభేదాలు లేవని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఆయన గౌరవప్రదమైన పదవిలో పనిచేశారని, ప్రభుత్వం ఆయన్ను ఎంతో గౌరవిస్తుందని ఆమె పేర్కొన్నారు. అయితే, ఆయన రాసిన పుస్తకంపై నిషేధం విధించామన్న వార్తలను ఆమె తోసిపుచ్చారు. రక్షణ శాఖ నుంచి రావాల్సిన సాంకేతికపరమైన అనుమతులు (క్లియరెన్స్) ఇంకా ప్రక్రియలోనే ఉన్నాయని, అంతకు

2 లో

# మీ భూమిపై ఎవ్వరి కన్ను పడకుండా నాదీ రక్షణ: సీఎం చంద్రబాబు

**పోలవరానికి శనీశ్వరుడిలా అడ్డుతగిలారు: సీఎం చంద్రబాబు**

హంద్రీనీవా, తెలుగు గంగా, గాలేరు– నగరి ప్రాజెక్టులు అన్న ఎన్టీఆర్ ఇచ్చారన్నారు. అనంతపురాన్ని ఉద్యానవనంగా మారుస్తున్నామని చెప్పారు. రాయలసీమలో ప్రస్తుతం అత్యధికంగా పంటలు పండించేలా నీరు ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో సైతం కరెంట్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చారు. తాను సీమ బిడ్డనేనని.. అన్న ఎన్టీఆర్ సైతం సీమ బిడ్డేనన్నారు. వైఎస్ జగన్ ఇప్పుడు వచ్చి రాయలసీమ అంటున్నారని పేర్కొన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. పోలవరానికి శనీశ్వరుడిలా అడ్డు తగిలారంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు సీఎం. గోదావరి పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు ఇచ్చే 100 టీఎంసీల నీటిని రాయలసీమకు మళ్లించి కరవును తొలగించామన్నారు.

**కరవు జిల్లాల్లో కియా కార్లు: సీఎం చంద్రబాబు**

కరవు జిల్లాల్లో కియా కార్లు పరుగెత్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు. అలా సీమను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రపంచానికి రాయలసీమ హార్టికల్చర్ అవుతుందని అభివర్ణించారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఎన్‌జీటీ అనుమతి లేని ప్రాజెక్ట్ తెచ్చి.. తనపై బురద జల్లాలని చూశారంటూ వైసీపీ నేతలపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగభద్ర(టీబీ) డ్యాం నీళ్లు కర్నూలు జిల్లా ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీఎస్ పూర్తి చేసి.. గుండ్రేవుల కోసం పక్క రాష్ట్రాలతో మాట్లాడి ఒప్పించి నిర్మిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. వేదవతి ప్రాజెక్ట్ తానే ప్రారంభించి.. పూర్తి చేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# నరవణె పుస్తకంపై కేంద్రం క్లారిటీ.. "నిషేధం లేదు.. కేవలం నిబంధనల ప్రకారమే పరిశీలన"

మించి మరేమీ లేదని ఆమె వివరించారు.భారత సాయుధ దళాల పనితీరుపై ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న నమ్మకాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. సరిహద్దుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఏది సరైనది అనిపిస్తే అది చేసే పూర్తి స్వేచ్ఛను ప్రధాని సైన్యానికి ఇచ్చారని ఆమె తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో ఉన్నట్లుగా సాయుధ దళాలు నిర్ణయాల కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని, మోదీ నాయకత్వంలో సైన్యం మరింత బలోపేతమైందని ఆమె అన్నారు.ఇదే క్రమంలో కాంగ్రెస్ హయాంలోని విదేశీ విధానాలను, గత ప్రధాని నెహ్రూ వైఖరిని నిర్మలా సీతారామన్ విమర్శించారు. చైనా దురాక్రమణ సమయంలో అరుణాచల్ ప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి "మిమ్మల్ని మీరు చూసుకోండి" అని నెహ్రూ అన్నట్లుగా, ఇప్పుడు మోదీ ప్రభుత్వం బాధ్యతలను విస్మరించదని ఆమె చురకలు అంటించారు. ప్రస్తుత ప్రభుత్వం సరిహద్దు ప్రాంతాల భద్రతను, అక్కడి ప్రజల ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యతగా భావిస్తుందని స్పష్టం చేశారు. మొత్తానికి, నరవణె పుస్తక వివాదానికి తెరదించుతూనే, దేశ రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు. మాజీ ఆర్మీ చీఫ్ అనుభవాలు దేశానికి ఆస్తి అని, అయితే భద్రతా పరమైన నిబంధనల మేరకు రక్షణ శాఖ అనుమతులు తప్పనిసరని ఆమె వెల్లడించారు. ఈ విషయంలో రాజకీయ విమర్శలకు తావులేదని, సైన్యం మరియు ప్రభుత్వానికి మధ్య ఉన్న సమన్వయం దృఢంగా ఉందని ఆమె తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# 38వ రోజు ప్రజల వద్దకు ఎమ్మెల్యే ప్రవీణ్




**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు మండలం పరస గ్రామంలో " ప్రజల వద్దకు ప్రవీణ్ : 100 రోజులు – 100 గ్రామాలు" పర్యటనలో పాల్గొన్నారు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 38వ రోజు గ్రామంలోని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఎమ్మెల్యే. త్వరితగతిన సమస్యలు పరిష్కారం అయ్యేలా పని చేయాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే.ప్రజా సమస్యల పరిష్కారం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా 100 రోజులు 100 గ్రామాల పర్యటన కొనసాగుతుందన్న ఎమ్మెల్యే.ప్రజలకు వచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తామన్న ఎమ్మెల్యే.గ్రామంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలు త్వరితగిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే.కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెన్న సాంబశివరెడ్డి, పెదకూరపాడు మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య 75 తాళ్లూరు సొసైటీ చైర్ పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, మండల తెదేపా నాయకులు సరిపుడి గోపి, కృష్ణకుమారి, ఎమ్మార్వో ఎన్ . ధనలక్ష్మి, ఎండిఓ సాయి లీల, మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాగిరెడ్డిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సూర్య మండల క్షేత్రం సందర్శించిన స్టేట్ ఆఫీసర్ మౌనిక



**(క్రైమ్ కౌంటర్)( నాయక్)** (బెల్లంకొండ) మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజి భారత్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పీహెచ్డీ విద్యార్థులు గురువారం ఉదయం అందే లక్ష్మీ తిరుపతమ్మ అన్ని రకాల కూరగాయలతో తన సొంత 5 సెంట్ల భూమి లో సూర్య మండల ఊహ చిత్ర నమూనాను ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సిద్ధం చేశారు సమాచారం తెలుసుకున్న ఇతరరాష్టల పీహెచ్డీ విద్యార్థులు యస్వంతు స్వాతి శృతి రంజన్ ప్రకృతి వ్యవసాయం లో అమలు అవుతున్న వివిధ విధానాలపై అవగాహన కల్పించారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో స్థిరమైన దిగుబడ్లు సాధించవచ్చు అని భూసారం పరిరక్షణ తో పాటు పంటల ఆరోగ్యం మెరుగుపడుతుంది అని తెలిపారు అలాగే బీజాఅమృతం తయారీ విధానాన్ని ప్రత్యక్ష రూపంలో డెమో రూపంలో చూపిస్తూ దాని వినియోగంపై అవగాహన కల్పించారు మరియు స్థానిక అంగన్ వాడి కేంద్రంలో ని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని కూడా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారుఈ కార్యక్రమంలో హెచ్ ఎన్ ఐ సిరాప్పిఅందే లక్ష్మీ తిరుపతమ్మ ప్రకృతి వ్యవసా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# రహదారి, డ్రైనేజీ ఆక్రమణలు: రెండు రోజుల్లో తొలగించండి - ఎస్ఐ ఆదేశం



**క్రైమ్ కౌంటర్ న్యూస్...గుంటూరు జిల్లాకొల్లిపర** కొల్లిపర గ్రామ పరిధిలోని ప్రధాన రహదారి, డ్రైనేజీలను ఆక్రమించిన వారిని వెంటనే తొలగించాలని ఎస్ఐ ఎన్.సి. ప్రసాద్ ఆదేశించారు. దుకాణదారులు రహదారికి ఇరువైపులా ఆక్రమణలు చేయడం వల్ల ట్రాఫిక్కు అంతరాయం కలిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. పంచాయతీ ఇప్పటికే నోటీసులు జారీ చేసినందున, రెండు రోజుల్లోగా ఆక్రమణలు తొలగించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆదేశాలు స్థానికుల్లో చర్చనీయాంశమయ్యాయి. ...

# ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్తున్నట్టుగా జగన్ పర్యటనలు: టీడీపీ ఎంపీ ఎద్దేవా

**క్రైమ్ కౌంటర్ న్యూస్):**అమరావతి, ఫిబ్రవరి 6: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని టీడీపీ ఎంపీ అప్పలనాయుడు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పులివెందుల ఎమ్మెల్యే జగన్.. తాడేపల్లి ప్యాలెస్ నుంచి జోగి రమేష్ ఇంటికి వెళ్తున్నారని అన్నారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా మాట్లాడిన వ్యక్తుల ఇంటికి పరామర్శకు వెళ్తున్నారని మండిపడ్డారు. జగన్ పర్యటనలు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నాయని ఎంపీ ధ్వజమెత్తారు.ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా జగన్ పర్యటనలు సాగుతున్నాయని ఎంపీ అప్పలనాయుడు విమర్శించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతుంటే.. దానికి జగన్ ఆటంకం కలిగిస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. జగన్ పర్యటనలపై ప్రజలు విసుక్కుంటున్నారని.. వైసీపీ నేతలు బూతు పురాణాలు తగ్గించాలని కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఏదో ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్తున్నట్టు జగన్ తన పర్యటనలు చేస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సమాజానికి మార్గదర్శకంగా రాజకీయ నేతలు ఉండాలని హితవుపలికారు.వైసీపీ నేతలు.. వంగవీటి రంగా కోసం ఎప్పుడైనా విజయవాడలో ఒక్క కార్యక్రమమైనా చేశారా? అని ప్రశ్నించారు. దేశ రాజధాని ఢిల్లీలో తిరుపతి లడ్డూపై చర్చ జరుగుతోందని.. ఎవరైనా లడ్డూ ఇస్తే ఎవరి హయాంలో తయారయ్యిందని అడుగుతున్నారని ఎంపీ పేర్కొన్నారు. కాపులకు, బీసీలకు రక్షణగా ఉన్నది టీడీపీ మాత్రమే అని స్పష్టం చేశారు. తనలాంటి వారిని చట్టసభలకు పంపిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకి దక్కుతుందని ఎంపీ అప్పలనాయుడు ప్రశంసించారు.

# సీసీ రోడ్ల కోసం శంకుస్థాపన చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు






**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు కోసూరు న్యూస్ :** పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశానుసారం కోసూరు మండలం పెరికపాడు గ్రామంలో 20 లక్షల రూపాయల రోడ్లకు శంకుస్థాపన చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులుఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు గ్రామ టిడిపి సీనియర్ నాయకులు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది

# విశాఖపట్నం వెళ్లేవారికి ఊరట, ట్రాఫిక్ ఫ్రీ జర్నీ



**అమరావతి, ఫిబ్రవరి 06 క్రైమ్ కౌంటర్ న్యూస్):** విజయవాడవాసులకు కేంద్రం మరో తీపికబురు చెప్పింది. వచ్చే నెలలో మరో బైపాస్ అందుబాటులోకి రానుంది. కేంద్రం సహకారంతో చినఆవుటపల్లి–గొల్లపూడి మధ్య 30 కిలోమీటర్లు.. ఆరు వరుసలుగా బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ బైపాస్ చెన్నై–కోల్‌కతా నేషనల్ హైవే 16లో విజయవాడ–గుండుగొలను సెక్షన్‌లో చినఆవుటపల్లి–గొల్లపూడి మధ్య ఉంటుంది. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం మార్చి 31కి పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ బైపాస్ అందుబాటులోకి వస్తే ఏలూరు, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలకు ఊరటల లభిస్తుంది.

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఈ బైపాస్ రోడ్డు నిర్మాణంపై అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. '2021 ఫిబ్రవరి 18న రూ.1,148.40 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. ఈ బైపాస్ రోడ్డుకు సంబంధించి ఇప్పటి వరకు 29.57 కిలోమీటర్లు పూర్తి చేశారు.. మరో 0.43 కి.మీ. పనులు జరుగుతున్నాయి. ఈ పనులు కూడా మార్చి 31 కల్లా పూర్తిచేయాలని టార్గెట్ పెట్టుకున్నాము' అని నితిన్ గడ్కరీ లోక్‌సభలో తెలిపారు. ఏపీలో రోడ్డు ప్రమాదాలపై కూడా నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో 2020–2024 మధ్య 1,629 బస్సు ప్రమాదాలు జరిగాయన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. గత ఆరేళ్లలో రాష్ట్రంలో 3,443 కిలోమీటర్ల నేషనల్ హైవేలు నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 34 టోల్ ప్లాజాలు ఏర్పాటు చేశారట.

ఇటు మరో బైపాస్ రోడ్డుపై గత నెలలో కేంద్రమంత్రి గడ్కరీ క్లారటీ ఇచ్చారు. విజయవాడ గొల్లపూడి నుంచి గుంటూరు జిల్లా చినకాకాని వరకు బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులు కూడా మార్చి 31 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. 2019లో రూ.1,194.59 కోట్ల అంచనా వ్యయంతో ఈ బైపాస్ నిర్మాణానికి అనుమతులు వచ్చాయి.. ఈ బైపాస్‌లో కృష్ణా నదిపై అవసరమైన చోట బ్రిడ్జిలు కూడా నిర్మిస్తున్నారు. మొత్తం 17.6 కిలో మీటర్ల బైపాస్‌లో 13.410 కిలోమీటర్ల పనులు పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చి 31 లోపు మిగిలిన 4.226 కిలోమీటర్ల పనులు టార్గెట్ పెట్టుకున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఈ బైపాస్ రోడ్లు అందుబాటులోకి వస్తే విజయవాడలో ట్రాఫిక్ సమస్యలు తీరతాయి. మొత్తం మీద విజయవాడకు చుట్టుపక్కల ఉన్న బైపాస్ రోడ్ల పనులు ముగింపు దశకు వచ్చాయి. సంక్రాంతి సమయంలో విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఒకవైపు వాహనాలను అనుమతించిన సంగతి తెలిసిందే. త్వరలోనే మిగిలిన పనులు పూర్తి చేసి రటటండో వైపు కూడా వాహనాలను అనుమతించనున్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రవీణ్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు మండలంలో 15 మందికి మంజూరైన 10,67,425 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 28వ విడత మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే.
అనారోగ్యం భారిన పడి అప్పులు తెచ్చుకుని చికిత్సపొందిన వారికి సిఎంఆర్ఎఫ్ అందించడం అభినందనీయమన్న ఎమ్మెల్యే. కష్టకాలంలో అనారోగ్యం భారిన పడిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తుందన్న ఎమ్మెల్యే.కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర సీనియర్ నాయకులు వెన్న సాంబశివరెడ్డి, పెదకూరపాడు మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, 75 తాళ్లూరు సొసైటీ చైర్ పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, మండల నాయకులు సరిపుడి గోపి , మక్కెనసాగర్, గల్లా శివ నాగరాజు, మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటిన ఎస్సై గిరిబాబు





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు మండల ఎస్సై గిరిబాబు శుక్రవారం పెదకూరపాడు గ్రామంలోని పోలీస్ స్టేషన్లో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కల పెంచే కార్యక్రమాన్ని చేపట్టాలని మండల ప్రజలకు పిలుపునిచ్చారు . మొక్కల వలన మనకు ఆక్సిజన్ అందుతుందని మొక్కలు చల్లని నీడనిస్తాయని అన్నారు . ఈ కార్యక్రమంలో సిబ్బంది మురళి, రాజేష్ నాయక్, తదితరులు ఉన్నారు

# నిరాశ్రాయులకు దుప్పట్లు, భోజనాల పంపిణి







**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు పల్నాడు జిల్లా :** ప్రముఖ సంఘ సేవకులు, అడ్వకేట్, వినుకొండ ఏ జి పి ముప్పాళ్ళ జ్ఞానేశ్వర్ రావు తన తండ్రి ముప్పాళ్ళ చెన్నయ్య 10వ వర్ధంతిని పురస్కరించుకుని మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని నిరాశ్రయులకు మరియు నిరుపేదలకు భారీ ఎత్తున దుప్పట్లు మరియు భోజనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జ్ఞానేశ్వర్ రావు, ఈ ఏడాది 10వ వర్ధంతిని పురస్కరించుకుని చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, రోడ్డు పక్కన నివసించే అభాగ్యులకు నాణ్యమైన దుప్పట్లను, ఆకలితో వున్నవారికి ఫౌండేషన్ సభ్యులతో కలిసి స్వయంగా భోజనం పంపిణి చేసారు.మా నాన్నగారు నేర్పిన సేవా దృక్పథమే నన్ను ఈ స్థాయికి చేర్చింది. వారి జ్ఞాపకార్థం నలుగురికి సహాయం చేయడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేదు. యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యుల సహకారం ఈ కార్యక్రమ విజయానికి ఎంతో తోడ్పడింది అన్నారు." కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు పమిడిపల్లి అనిల్ రాజ్, ఉపాధ్యక్షులు గుమ్మడి మనోహర్, జాయింట్ సెక్రెటరీ పెనుమాల వెంకట్రావు, ట్రెజరర్ కె.సునీల్ తదితరులు పాల్గొన్నారు

## ఖో-ఖో పోటీలలో బ్రహ్మనాయుడు స్కూల్ విద్యార్ధుల హవా



**క్రైం కౌంటర్ కారంపూడి** జనవరి 31 ఫిబ్రవరి 1, 2 తారీకు లలో విజ్ఞాన్ యూనివర్సిటీ వారు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి లో నిర్వహించిన బాల మహోత్సవ క్రీడా పోటీలలో ఖ/14 మరియు ఖ/17 ఖో -ఖో రెండు విభాగాలలో ఒక్కో విభాగంలో 40 బాలుర టీములు పాల్గొనడం జరిగింది.ఖ/14 విభాగంలో ప్రథమ స్థానం, ఖ/17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించడం జరిగినదని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.శివ శేషిరెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి ముఖ్య అతిథిగా ఎంఈఓ రవికుమార్ పాల్గొని విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా చాలా అవసరమని చదువు మరియు క్రీడలు రెండింట్లో రానించినవారికి ఆరోగ్యంతో పాటు మంచి భవిష్యత్తు ఉంటుందని అందరూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివ శేషిరెడ్డి, ఎంఈఓ రవికుమార్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది గెలుపొందిన క్రీడాకారులను వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు స్వర్ణరాజు,అమల,సుష్మిత లను అభినందించారు.

# ఒకటికి రెండు.. విజయపథంలో 'గ్రూప్' వీరులు




**15 మందికి గ్రూప్ 1,2 రెండిటిలోనూ కొలువులు**
**గ్రూప్-2 వదిలేసి గ్రూప్-1 పోస్టులో చేరే యోచన**
**ఖాళీ పోస్టులు మెరిట్ అభ్యర్థులకు ఇవ్వాలనే విజ్ఞప్తులు**
**కొద్ది మందికి తెలంగాణ, ఏపీల్లోనూ కొలువులు**

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** అమరావతి -ప్రభుత్వ ఉద్యోగం చాలా మంది కల..! దీనికోసం ఏళ్ల తరబడి కష్టపడి చదువుతారు..! అలా కష్టపడిన వారిలో కొందరికి ఉద్యోగాల పంట పండింది.! పలువురు అభ్యర్థులు అటు గ్రూప్-2 ఇటు గ్రూప్-1 రెండిట్లోనూ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రభుత్వం ఉద్యోగం వస్తే చాలు.. అనే పరిస్థితి నుంచి ఇప్పుడు ఏ ఉద్యోగం కావాలో ఎంపిక చేసుకునే స్థాయికి చేరుకున్నారు. కాగా.. వారిలో కొందరు ఇప్పటికే ఇతరత్రా ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న వాళ్లు కూడా ఉన్నారు. కొద్ది మంది అభ్యర్థులైతే ఇటీవల విడుదలైన తెలంగాణ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించి.. ఇప్పుడు ఏపీలోనూ కొలువులకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1, గ్రూప్-2 రెండు నోటిఫికేషన్లలోనూ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు 15 మంది ఉన్నారు. గత వారం గ్రూప్-1 ఫలితాలు విడుదల కాగా, అంతకముందు గ్రూప్-2 ఫలితాలు వచ్చాయి. రోజుల వ్యవధిలోనే రెండు నోటిఫికేషన్ల ఫలితాలు రావడంతో రెండిటికీ ఎంపికైన అభ్యర్థులు గ్రూప్-2 ఉద్యోగాలను వదిలేయనున్నారు. అలాగే రెండు రాష్ట్రాల్లోనూ ఉద్యోగాలు సాధించినవారిలో ఒకరిద్దరు తెలంగాణలోనే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. కాగా రెండిట్లో ఎంపికైన నేపథ్యంలో ఖాళీ అయ్యే గ్రూప్-2 ఉద్యోగాలను తర్వాత మెరిట్ అభ్యర్థులకు ఇవ్వాలని సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులు కోరుతున్నారు. దానివల్ల పోస్టులను క్యారీ ఫార్వార్డ్ చేసే అవసరం ఉండదని, అలాగే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని అంటున్నారు.రెండు నోటిఫికేషన్లలో ఎంపిక ఓ అభ్యర్థికి గ్రూప్-2లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది. ఆ వెంటనే గ్రూప్-1 ఫలితాల్లో ఆర్టీవో ఉద్యోగం సాధించారు. మరో అభ్యర్థి గ్రూప్-2లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎంపికవగా, గ్రూప్-1లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్ ఉద్యోగం వచ్చింది. ఓ అభ్యర్థికి గ్రూప్-2లో సబ్ రిజిస్ట్రార్, గ్రూప్-1లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ ఉద్యోగాలు వచ్చాయి. కాగా.. వ్యక్తిగత కారణాలతో ఆయన గ్రూప్-2 ఉద్యోగంలోనే చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. మరో అభ్యర్థికి గ్రూప్-2లో డిప్యూటీ తహసీల్దారు ఉద్యోగం, గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చాయి. ఇంకో అభ్యర్థికి గ్రూప్-లో జూనియర్ అసిస్టెంట్ వస్తే, గ్రూప్-1లో డిప్యూటీ రిజిస్ట్రార్ వచ్చింది. మరో అభ్యర్థికి గ్రూప్-2లో జూనియర్ అసిస్టెంట్, గ్రూప్-1లో ఏసీటీవో ఉద్యోగాలొచ్చాయి. ఇలా 15 మందికి రెండు నోటిఫికేషన్లలోనూ ఉద్యోగాలొచ్చాయి. వీరిలో ఒకరిద్దరు మినహా అందరూ గ్రూప్-2 ఉద్యోగాలను వదిలేయనున్నారు. మరోవైపు సుదర్శన్ అనే అభ్యర్థి ఇటీవల విడుదలైన తెలంగాణ గ్రూప్-1లో డీఎస్పీ ఉద్యోగం సాధించగా, ఇప్పుడు ఏపీ గ్రూప్-1లోనూ ఉద్యోగం సాధించారు. లక్ష్మీ దీపిక అనే అభ్యర్థికి రెండు రాష్ట్రాల్లోనూ డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాలు వచ్చాయి. ఏపీలో గ్రూప్-1లో సంక్షేమ శాఖలో ఉద్యోగం సాధించిన ఓ అభ్యర్థి ఆ ఉద్యోగంలో చేరేందుకు విముఖంగా ఉన్నట్లు తెలిసింది.ఏపీపీఎస్సీ ఇదే చెప్పిందితొలుత గ్రూప్-2 ఫలితాలు ఇస్తే గ్రూప్-1 ఫలితాల అనంతరం పలు పోస్టులు ఖాళీ అవుతాయని ఏపీపీఎస్సీ ముందే అభిప్రాయపడింది. అందుకే గ్రూప్-2 ఫలితాలు ఇవ్వాలని అభ్యర్థులు పదే పదే కోరినా కొంత ఆలస్యం చేస్తూ వచ్చింది. చివరికి గ్రూప్-1 కేసు ఎంతకీ తేలకపోవడం, గ్రూప్-2 ఫలితాల కోసం ఒత్తిడి పెరగడంతో తొలుత ఆ ఫలితాలు ఇచ్చింది. అయితే రెండు నోటిఫికేషన్ల ఫలితాల మధ్య సమయం చాలా తక్కువగా ఉన్నందున గ్రూప్-1 ఫలితాలు ముందుగా ఇచ్చినా పెద్దగా మార్పులేం ఉండేవి కావు. గ్రూప్-1కు ఎంపికైనవారు గ్రూప్-2 ఉద్యోగాల్లో చేరకుండానే వదిలేసే పరిస్థితి వచ్చినందున ఆ పోస్టులను తర్వాత మెరిట్ అభ్యర్థులకు కేటాయించాలని సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికై చివరి దశలో ఉద్యోగాలు రాని అభ్యర్థులు కోరుతున్నారు. 2016కు ముందు ఇలా తర్వాత మెరిట్ అభ్యర్థులకు పోస్టులు కేటాయించే విధానం ఉండేది. చాలాకాలం నుంచి మిగిలిపోయిన పోస్టులను క్యారీ ఫార్వార్డ్ చేసి తర్వాత నోటిఫికేషన్లలో గుర్తిస్తున్నారు. అయితే రెండు నోటిఫికేషన్ల ఫలితాలు రోజుల వ్యవధిలోనే రావడం వల్ల గ్రూప్-2 ఉద్యోగాల్లో అభ్యర్థులు చేరనందున తర్వాత వారికి అవకాశం ఇస్తే వారికి మేలు జరుగుతుందని అభ్యర్థులు అంటున్నారు.

## సీమ లిఫ్ట్‌పై ఆందోళనా.. వైసీపీకి సిగ్గుండాలి

గంగాధరనెల్లూరు/పలమనేరు, ఫిబ్రవరి 6 'రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఆందోళనలు చేయడానికి వైసీపీకి సిగ్గుండాలి. అధికారంలో ఉన్న ఐదేళ్లూ మోదీకి దత్తపుత్రుడిగా ఉన్న జగన్, కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేలేదు?' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరులో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. 'వైసీపీ అధికారంలో ఉండగా సీమ ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పూర్తి చేయలేదు? ఎన్జీటీ దగ్గర అనుమతుల కోసం వాదనలు ఎందుకు వినిపించలేదు? అనుమతులు వచ్చేలా కేంద్రాన్ని ఎందుకు ఒప్పించలేదు?' అంటూ ప్రశ్నలు సంధించారు. చంద్రబాబు, జగన్ ఇద్దరూ సీమ ద్రోహులేనన్నారు. నల్లగుట్టపల్లిలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ..గాడ్సే ఆనాడు మహాత్మాగాంధీని ఎలా హత్య చేశాడో... నేడు పేదలకు ఉపయోగపడుతున్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి మహాత్ముడి ఆశయాలను మోదీ తుంచివేశారు. ఆయన కూడా గాడ్సేతో సమానమే' అని విమర్శించారు.

# సినిమా




## ‘ది రాజా సాబ్’ ఓటిటి రివ్యూ.

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన హార్రర్ కామెడీ ఎంటర్టైనర్ రాజా సాబ్ ఓటిటిలోకి ఎంట్రీ ఇచ్చింది. థియేటర్లలో విడుదలైన మొదటి రోజే డివైడ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా.. కేవలం ప్రభాస్ అనే బ్రాండ్ ఇమేజ్, ఆయన స్టార్‌డమ్‌తో బాక్సాఫీస్ వద్ద 200 కోట్ల రూపాయల మార్క్ దాటేసింది. కథలో విషయం ఉందా లేదా అనే విషయం పక్కన పెడితే.. ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్ వల్లే ఆ మాత్రం వసూళ్లు వచ్చాయని అందరికీ తెలుసు. అయితే థియేట్రికల్ రన్ ముగిసిన తర్వాత.. ఇప్పుడు స్మాల్ స్క్రీన్ మీద సినిమా రిలీజ్ అవ్వడంతో అందరి దృష్టి దీనిపై పడింది. ముఖ్యంగా థియేటర్ రిలీజ్ సమయంలో వచ్చిన విపరీతమైన ట్రోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని, ఓటిటి వెర్షన్‌లో మేకర్స్ ఏమైనా మార్పులు చేశారా.? లేక అక్కడ జరిగిన డ్యామేజ్ ఇక్కడ కూడా కంటిన్యూ అవుతుందా.? అనే ఆసక్తి అందరిలోనూ ఉంది. సినిమా థియేటర్లలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు.

సినిమాలోని చాలా సన్నివేశాల్లో.. ముఖ్యంగా లాంగ్ షాట్స్ అండ్ ఫైట్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ కాకుండా ఆయన బాడీ డబుల్ స్పష్టంగా కనిపిస్తున్నారంటూ నెటిజన్లు ఫోటోలు, వీడియోలతో సహా ట్రోల్ చేశారు. ఒక పక్క స్టార్ హీరో సినిమా అయ్యుండి.. ఇలాంటి ఔట్ పుట్ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దర్శకుడు మారుతి టేకింగ్ బాగున్నప్పటికీ, విజువల్ క్వాలిటీ విషయంలో.. హీరోని చూపించే విషయంలో శ్రద్ధ తీసుకోలేదనేది అభిమానుల ప్రధాన ఆరోపణ. ఈ నెగిటివ్ టాక్ వల్లే సినిమా అనుకున్న రేంజ్‌లో బ్లాక్ బస్టర్ కాలేకపోయిందనే వాదన కూడా ఉంది. అందుకే ఇప్పుడు ఓటిటి రిలీజ్‌లో ఆ తప్పులను సరిదిద్దేందుకు చిత్ర యూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా థియేటర్లో రిలీజైన సినిమానే యథాతథంగా ఓటిటిలో వదులుతారు. కానీ రాజా సాబ్ విషయంలో డిజిటల్ స్ట్రీమింగ్ సంస్థ, నిర్మాతలు ఒక అడుగు ముందుకేసి డ్యామేజ్ కంట్రోల్ చర్యలు చేపట్టారు.

ఓటిటి వెర్షన్ కోసం ప్రత్యేకంగా కలర్ గ్రేడింగ్‌లో మార్పులు చేశారు. థియేటర్లో డల్లుగా అనిపించిన కొన్ని ఫ్రేమ్స్‌ని బ్రైట్‌గా మార్చడం, వీఎఫ్ఎక్స్ లోపాలను సరిదిద్దడం అర్థమైపోతుంది. అంతేకాకుండా థియేటర్లో ఎడిటింగ్‌లో లేపేసిన కొన్ని కొత్త సన్నివేశాలను డిజిటల్ వెర్షన్‌లో యాడ్ చేయడం విశేషం. ఈ కొత్త సీన్స్ కథనానికి మరింత బలాన్ని చేకూర్చడమే కాకుండా, సినిమా ఫ్లోని కాస్త పేసీగా మార్చాయి. ట్రోలింగ్‌కు ఆస్కారం ఉన్న కొన్ని షాట్స్‌ను ట్రిమ్ చేయడం.. అలాగే కలర్ కరెక్షన్ ద్వారా కవర్ చేయడం వల్ల సినిమా క్వాలిటీ పెరిగింది. థియేటర్‌లో నెగిటివ్ రివ్యూలు చూసి సినిమాకు వెళ్లని వాళ్లు, ఇప్పుడు ఓటిటిలో చూసి ఆశ్చర్యపోతున్నారు. సినిమా మరీ అంత తీసిపారేసేలా లేదు కదా, బాగానే ఉంది అంటూ పాజిటివ్ కామెంట్స్ పెడుతున్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుండి ఓటిటిలో మంచి స్పందన లభిస్తోంది. మారుతి మార్క్ కామెడీ, హార్రర్ ఎలిమెంట్స్ బాగానే అలరిస్తున్నాయి.






## ఈ నాలుగు సమస్యలను తరిమేసే తమలపాకులు.

ప్రజలు సాధారణంగా పాన్‌ను మౌత్ ఫ్రెషనర్‌గా పిలుస్తారు. కానీ ఆయుర్వేదం, సాంప్రదాయ వైద్యంలో ఇది ఆరోగ్యానికి ప్రయోజనకరంగా కూడా. తమలపాకులకు మతపరమైన, సాంస్కృతిక ప్రాముఖ్యత కూడా ఉంది. దీని చరిత్ర సుమారు ఐదు వేల సంవత్సరాల నాటిదని చెబుతారు. తమలపాకుల గురించి అనేక పురాతన, మత గ్రంథాలలో కూడా ప్రస్తావించారు. తమలపాకు అనే పదం సంస్కృత పదం పర్ణ నుండి ఉద్భవించింది. దీని అర్థం ఆకు. సాంస్కృతిక ప్రాముఖ్యతకు మించి, తమలపాకులను ఆరోగ్యానికి ప్రయోజనకరంగా కూడా భావిస్తారు.

తమలపాకులను వివిధ రకాలుగా తినవచ్చు. కొందరు ఖాళీ కడుపుతో వాటిని నమిలితే, మరికొందరు వాటితో టీ తయారు చేసుకుని తాగుతారు. తమలపాకులను అనేక సాంప్రదాయ, ఆధునిక వంటకాల్లో కూడా ఉపయోగిస్తారు. పాన్ తండాయ్ తయారు చేయడం కూడా చాలా సులభం. దీనికి తమలపాకులు, గుల్కండ్, పాలు, వెనిల్లా ఎసెన్స్, తండాయ్ పొడి అవసరం. ముందుగా తండాయ్ పొడిని నీటిలో నానబెట్టి, తమలపాకులను బాగా కడగాలి.ఇప్పుడు నానబెట్టిన తండాయి, తమలపాకులు, పాలు లేదా నీటిని మిక్సీలో వేసి బాగా కలపండి. మిశ్రమం మెత్తగా అయిన తర్వాత తండాయి సిద్ధంగా ఉంటుంది. దానిని ఒక గ్లాసులో పోసి ఐస్ క్యూబ్స్ తో చల్లగా సర్వ్ చేయండి. తమలపాకుల్లో ఉండే యాంటీమైక్రోబయల్ లక్షణాలు నోటిలోని హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడతాయి. భోజనం తర్వాత తమలపాకులను నమలడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుందని, నోటి దుర్వాసన తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.తమలపాకులు బరువును నిర్వహించడానికి, మలబద్ధకం నుండి ఉపశమనం పొందడానికి, నొప్పిని తగ్గించడానికి కూడా సహాయపడతాయని నమ్ముతారు. అయితే, ఈ సమాచారం సాధారణమైనది. ఏవైనా ఆరోగ్య సమస్యల కోసం వాటిని క్రమం తప్పకుండా తీసుకునే ముందు వైద్యుడిని లేదా నిపుణుడిని సంప్రదించడం ముఖ్యం.



## నాలుగే నాలుగు ఆకులు చాలు.

మన నిత్య జీవితంలో చిన్నపాటి మార్పులు చేసుకోవడం వల్ల కొన్నిసార్లు అనూహ్యమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అలాంటి ఒక అద్భుతమైన మార్గం ఉదయాన్నే కొన్ని కరివేపాకుల్ని తినడం.. అవును.. కరివేపాకు ఆకులను ఉదయాన్నే తింటే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు.. మన వంట ఇంట్లో నిత్యం ఉండే కరివేపాకులు కేవలం కూరలకు రుచి, సువాసనను మాత్రమే కాదు, సంపూర్ణ ఆరోగ్యానికి ఎన్నో లాభాలను అందిస్తాయి. చాలామంది కూరల్లో కరివేపాకుల్ని పక్కన పెట్టేస్తుంటారు.. కానీ వాటి ప్రయోజనాలు తెలిస్తే ఎవరూ వాటిని వదులుకోరు. ఇవి మన చర్మం, జుట్టు ఆరోగ్యంతో పాటు మొత్తం శారీరక వ్యవస్థకు రక్షణ కల్పిస్తాయి. అందుకే వంటల్లో వాడటంతో పాటు, ఉదయాన్నే ఖాళీ పొట్టతో కొన్ని కరివేపాకుల్ని తినడం అత్యంత మేలు చేస్తుంది. మొదట్లో కాస్త చేదుగా అనిపించినా, క్రమంగా అలవాటు పడిపోతారు.

కరివేపాకుల్లో ఎన్నో పోషకాలు..

కరివేపాకుల్లో విటమిన్ సి, ఫాస్ఫరస్, ఐరన్, కాల్షియం, నికోటినిక్ యాసిడ్ వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ పోషకాలు శరీరానికి అనేక విధాలుగా సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

జుట్టు ఆరోగ్యానికి మంచిది: జుట్టు రాలే సమస్యతో బాధపడేవారు ఉదయం నిద్ర లేవగానే ముందుగా ఒక గ్లాసు మంచినీరు తాగాలి. కొన్ని నిమిషాల తర్వాత నాలుగైదు కరివేపాకుల్ని నోట్లో వేసుకొని బాగా నమిలేయాలి. ఆ తర్వాత అరగంట పాటు ఏమీ తినకుండా ఉండాలి. ఈ విధానం జుట్టు రాలడాన్ని తగ్గించి, దాని ఎదుగుదలకు తోడ్పడుతుంది. కూరల్లో కరివేపాకుల్ని ఎక్కువగా వాడటం కూడా జుట్టు రాలే సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది.

జీర్ణక్రియ మెరుగుదలకు మంచిది: కరివేపాకుల్ని తినడం వల్ల పొట్టలో జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఖాళీ పొట్టతో వీటిని నమలడం వల్ల జీర్ణ వ్యవస్థలోని ఎంజైమ్‌లు క్రమబద్ధీకరించబడతాయి. ఇది మూత్రనాళం చక్కగా పనిచేసేలా చేసి, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. కొందరికి ఉదయం లేవగానే బద్ధకంగా, వికారంగా అనిపిస్తుంది. ఈ సమస్య కరివేపాకులతో తీరిపోతుంది. జీర్ణక్రియ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం వల్ల వికారం, వాంతులు అయ్యే పరిస్థితి నుండి బయటపడవచ్చు.

బరువు తగ్గడంలో -- కొలెస్ట్రాల్ నియంత్రణలో సహాపడుతుంది: బరువు తగ్గాలని కోరుకునేవారు కరివేపాకుల్ని తమ ఆహారంలో భాగంగా చేసుకోవాలి. ఇవి శరీరంలో పేరుకుపోయిన చెడు వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడతాయి. ముఖ్యంగా, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యంగా ఉంచడంలో కరివేపాకులు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది.

కంటి చూపు మెరుగుదలకు మంచిది: కరివేపాకులకు కంటి చూపుతో ప్రత్యక్ష సంబంధం ఉంది. ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## పాకిస్థాన్‌కు ఫస్ట్ మ్యాచ్‌తోనే ఫుల్ టెన్షన్..

భారత్, శ్రీలంక వేదికగా టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభం కానుంది. అయితే భారత్‌లో మా ఆటగాళ్లకు భద్రత లేదంటూ.. బంగ్లాదేశ్ జట్టు ఇప్పటికే ఈ టోర్నీ నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. దీంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌కు ఆడే అవకాశం లభించింది. మరోవైపు బంగ్లాకు మద్దతు పాకిస్థాన్ సైతం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత ఏకంగా టీ20 వరల్డ్ కప్‌నే బాయ్‌కాట్ చేయాలని పాక్ భావించింది. కానీ ఐసీసీ కన్నెర్ర జేస్తుందనే భయంతో చివరికి వెనక్కి తగ్గింది. టీ20 వరల్డ్ కప్‌లో ఆడతాం కానీ.. ఫిబ్రవరి 15న భారత్‌తో మ్యాచ్ ఆడబోం అని పాకిస్థాన్ ప్రకటించింది. భారత్‌తో మ్యాచ్‌లో పాకిస్థాన్ ఆడకపోతే.. ఆ జట్టు కీలకమైన రెండు పాయింట్లు కోల్పోవాల్సి వస్తుంది. ఈ పాయింట్లు టీమిండియా ఖాతాలో పడతాయి. ఇది పాకిస్థాన్ తదుపరి దశకు చేరుకునే అవకాశాలను ప్రభావితం చేస్తుంది. ఈ టెన్షన్లో పాకిస్థాన్ ఆటగాళ్లు ఉండగానే.. ఆ జట్టుకు మరో షాక్ తగలబోయే సూచనలు కనిపిస్తున్నాయి.

షెడ్యూల్ ప్రకారం.. ఫిబ్రవరి 7న పాకిస్థాన్, నెదర్లాండ్స్ మధ్య జరిగే మ్యాచ్‌తో ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభం అవుతుంది. అయితే కొలంబోలోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ గ్రౌండ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌కు వాతావరణం అనుకూలించకపోయే అవకాశం ఉంది. ఈ వేదిక మీదే.. పాకిస్థాన్, ఐర్లాండ్ మధ్య వార్మప్ మ్యాచ్ జరగాల్సి ఉండగా.. ఎడతెగని వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండా ఈ మ్యాచ్ రద్దయ్యింది.

పాకిస్థాన్ తొలి మ్యాచ్ ఆడబోయే శనివారం నాడు కూడా కొలంబోలో వర్షం కురిసే అవకాశం ఉంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. ఆ రోజు వర్షం కురిసే అవకాశం 60-70 శాతంగా ఉంది. మ్యాచ్ జరిగే టైంలోనే వర్షం కురిసే ఛాన్స్ ఉండటంతో ఆటకు అంతరాయం కలగొచ్చు. ఒకవేళ వర్షం ప్రభావం ఎక్కువగా ఉంటే ఓవర్లను కుదించాల్సి వస్తుంది. కొలంబోలో వాతావరణం వేగంగా మారుతుంది. ఒకవేళ వర్షం గనుక భారీగా పడి మ్యాచ్ రద్దయితే.. పాకిస్థాన్, నెదర్లాండ్స్‌కు చెరో పాయింట్ కేటాయిస్తారు. భారత్‌తో మ్యాచ్‌ను కూడా బాయ్‌కాట్ చేస్తే.. రెండు మ్యాచ్‌లకుగానూ పాక్ ఖాతాలో ఒక్క పాయింటే చేరుతుంది.

దీని వల్ల పాకిస్థాన్ సూపర్ 8 చేరాలంటే.. గ్రూప్-ఏలో అమెరికా, నమీబియా జట్లతో మ్యాచ్‌లు చావో రేవో అన్నట్టుగా మారతాయి. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. 2024 టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌ను అమెరికా జట్టు ఓడించింది. దీంతో పాక్ లీగ్ దశలోనే ఇంటి ముఖం పట్టింది.

ఒకవేళ పాకిస్థాన్ ఆడే తొలి మ్యాచ్ రద్దయ్యి.. భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తే.. పాక్ గ్రూప్-8 చేరే అవకాశాలను సూర్య సేన ప్రభావితం చేయగలదు. అమెరికా గత టోర్నీలో పాక్‌పై చేసిన మ్యాజిక్‌ను రిపీట్ చేసి.. టీమిండియా ఒక మ్యాచ్‌లో ఓడితే గనుక.. పాకిస్థాన్ సూపర్-8కు చేరడం కష్టం అవుతుంది.




## పెళ్లి రద్దు బాధ నుంచి బయటపడి, డబ్ల్యూపీఎల్ టైటిల్ విన్నర్‌గా

డబ్ల్యూపీఎల్ 2026 ఫైనల్లో ఆర్సీబీ అమ్మాయిలు అదరగొట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 204 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆర్సీబీ సునాయాసంగా ఛేధించింది. కెప్టెన్ స్మృతి మంధాన (41 బంతుల్లో 87), జార్జియా వోల్ (54 బంతుల్లో 79) దూకుడుగా ఆడటంతో 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఆర్సీబీ వరుసగా రెండో ఏడాది డబ్ల్యూపీఎల్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. అయితే మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రం వరుసగా నాలుగోసారి డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఓటమిపాలైంది. బెంగళూరు విజయంలో కెప్టెన్ స్మృతి మంధాన కీలక పాత్ర పోషించారు. ఫైనల్లో భారీ లక్ష్య చేధనలో 41 బంతుల్లో 87 రన్స్ చేసిన స్మృతి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. తీవ్ర ఒత్తిడి ఉండే ఫైనల్లో, అదీ ఛేజింగ్‌లో ఇంత దూకుడుగా బ్యాటింగ్ చేయడం సామాన్యమైన విషయం కాదు. అంతే కాదు ఈ డబ్ల్యూపీఎల్ సీజన్లో 377 పరుగులతో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గానూ ఆమె నిలిచారు. దీన్ని బట్టి మంధాన ఎంతటి ఫామ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.

అయితే గత ఏడాది స్మృతి వ్యక్తిగత జీవితంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. 2025 నవంబర్ 23న మహారాష్ట్రలోని సంగ్లీలో పలాష్ ముచ్చల్‌తో ఆమె వివాహం జరగాల్సి ఉంది. కానీ పెళ్లికి కొద్ది గంటల ముందు అనూహ్యంగా వివాహం నిలిచిపోయింది. అనంతరం పెళ్లిని రద్దు చేసుకుంటున్నట్లు ఆమె ప్రకటించారు. ముందుగా తండ్రి అనారోగ్యం కారణం అని చెప్పినప్పటికీ.. అంతకు మించి ఏదో జరిగిందనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి.

ఇటీవల స్మృతి చిన్ననాటి స్నేహితుడు ఒకరు పలాష్ ముచ్చల్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలాష్ పెళ్లికి ముందు మరో అమ్మాయితో బెడ్ మీద రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడంటూ సంచలన ఆరోపణలు చేశారు. అయితే పలాష్ ఈ ఆరోపణలను ఖండించారు. కారణం ఏదైనప్పటికీ.. స్మృతి పెళ్లి మాత్రం ఆగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో మరొకరైతే డిప్రెషన్లోకి వెళ్లిపోతారు. ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టడానికే భయపడతారు. కానీ స్మృతి మాత్రం ఈ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. అంతే కాదు ఎంతో వేగంగా ఈ బాధ నుంచి బయట పడ్డారు. వ్యక్తిగత జీవితంలోని పరిణామాలు ప్రొఫెషనల్ గేమ్‌పై ఏమాత్రం ప్రభావం చూపకుండా తను జాగ్రత్తపడ్డారు. బ్యాట్‌తో అద్భుతంగా రాణించడమే కాకుండా.. కెప్టెన్‌గానూ సత్తా చాటి వరుసగా రెండోసారి డబ్ల్యూపీఎల్ టైటిల్‌ను ఆర్సీబీకి అందించారు. అందుకే విరాట్ కోహ్లి ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు. గత రెండు నెలల్లో స్మృతి ఎంతగా ఇబ్బంది పడిందో ఆమె సహచర మహిళా క్రికెటర్లకు తెలుసు. అందుకే శ్రేయాంక పాటిల్ ఆర్సీబీ టైటిల్ విజయాన్ని తమ కెప్టెన్ స్మృతి మంధానకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jaganna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.